క్లుప్తంగా

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గం



నందిగామ: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గ ఎన్నిక ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. న్యాయవాది గోపు వెంకట శ్రావణ్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం జరిగిన ఎన్నికలో ఆలయ పాలకవర్గ అధ్యక్షుడిగా మారం వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా వనమా నరసింహారావు, కోశాధికారిగా ఊటుకూరు సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



పెనుగంచిప్రోలు: మునేరుకు వచ్చిన భారీ వరద కారణంగా పైపులైన్‌లు కొట్టుకు పోవటంతో పాటు, తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రతి వీధికి రాత్రి, పగలు తేడా లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. మునేరు వరద ఉధృతి తగ్గిన వెంటనే తాగునీటి సరఫరాను పూర్తి స్థాయిలో పునఃరుద్ధరిస్తామన్నారు.

మా కుటుంబం సీఎం జగన్‌కు రుణపడి ఉంటుంది

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా రూ.కోటి ఆర్థిక సాయం



కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గత ఏడాది రూపొందించిన జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామానికి చెందిన సూర్యదేవర శ్రీహర్షకు రూ.కోటి ఆర్థిక సాయం అందుతోంది. అమెరికాలోని న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో సీటు పొందిన శ్రీహర్ష ఈ పథకానికి దరఖాస్తు చేయగా యూనివర్సిటీ ఫీజు మొత్తం కోటి రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. శ్రీహర్ష తల్లిదండ్రులకు వ్యవసాయమే జీవనాధారం. విదేశాల్లో చదివించేంత ఆర్థిక వెసులుబాటు లేదు. ఈ పథకం గురించి స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు ద్వారా తెలుసుకుని దరఖాస్తు చేశానని, ఫీజు మొత్తం కోటి రూపాయలు మంజూరయ్యాయని తెలియగానే ఒక్కసారిగా ఆశ్చర్యం, ఆనందంతో అవాక్కయ్యానని శ్రీహర్ష చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని ఉద్వేగంగా అన్నారు.

రేపు క్రైస్తవుల శాంతి ర్యాలీ

జగ్గయ్యపేట అర్బన్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా జగ్గయ్యపేట పట్టణ, నియోజకవర్గ ఐక్య పాస్టర్స్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో ఆగస్టు 1 వ తేదీన పట్టణంలో క్రైస్తవుల శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు జగ్గయ్యపేట పట్టణ, నియోజకవర్గ ఐక్య పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు ఎస్.ప్రవీణ్ కుమార్, నకిరికంటి జోసఫ్ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ ఉదయం 8 గంటలకు స్థానిక ఎస్‌జీఎస్ కళాశాల గ్రౌండ్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జరుగుతుందని తెలిపారు. పేట పట్టణ, నియోజకవర్గ దైవ సేవకులు, అన్ని సంఘాల విశ్వాసులు పాల్గొని మణిపూర్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంఘీభావం తెలియజేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

రచయితల సేవలు చిరస్మరణీయం

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో ఆదివారం షిరిడిసాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఇరువురు ప్రముఖ రచయితల జయంతిని ఘనంగా నిర్వహించారు. రచయితలు రాచకొండ విశ్వనాథశాస్త్రి, పులికంటి కృష్ణారెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు సాహితీ ప్రపంచంలో వారు చేసిన సేవలు చిరస్మరణీయమని, వారి రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. గ్రంథాలయాధికారిణి వి.జ్యోతిర్మయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో అండగా నిలుస్తూ..



వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు(ఫైల్)

నందిగామ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు సైతం ఆయన బాటలోనే నడుస్తూ నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. గత పాలకులకు భిన్నంగా ప్రజాసేవే లక్ష్యంగా నాయకులు పనిచేస్తున్నారు. తాజాగా మునేరుకు వరద వచ్చిన సమయంలో పూర్తిగా వరద తగ్గేంతవరకు నందిగామలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రజలతో మమేకమై సేవలందించారు.

బాధితులకు ధైర్యం చెబుతూ...

మునుపెన్నడూ లేని విధంగా మునేరుకు ఒక్కసారిగా వరద వచ్చింది. ఆ సమయంలో నందిగామ మండలం కంచల ప్రాంతంలో 12 మంది వ్యవసాయ కూలీలు పొలాలకు వెళ్లి మునేటి వరదలో చిక్కుకున్నారు. గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ వెంటనే కంచల గ్రామానికి వెళ్లి అక్కడే ఉండి ఎప్పటికప్పుడు బాధితులకు ధైర్యం చెబుతూ ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల సహకారంతో అర్ధరాత్రి సమయానికి బాధితులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చేలా చేశారు. నందిగామ పట్టణంలోని పాత బస్టాండ్, ఏడవ వార్డు ప్రాంతాల్లో భారీగా వరద నీరు ఇళ్లలోకి చేరుకుంది. నిలువెత్తు లోతు నీళ్లలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు స్వయంగా బాధితుల వద్దకు వెళ్లి వాళ్లకు ధైర్యం చెబుతూ ట్రాక్టర్లు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల ద్వారా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పల్లగిరి సమీపంలో మునేరు వాగులో చిక్కుకున్న ముగ్గురు వ్యవసాయ కూలీలను కూడా సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇవన్నీ తెల్లవార్లూ జరిగిన సేవా కార్యక్రమాలు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కనీసం కంటిమీద కునుకు లేకుండా ఆ సమయంలో ప్రజారక్షణే ముఖ్యంగా పనిచేశారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు వారి సేవా నిరతిని కొనియాడుతున్నారు.



మునేరులో చిక్కుకున్న వారిని రక్షించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్ (ఫైల్)

మేమున్నామని ధైర్యం చెప్పి రక్షించారు



వరద సమయంలో మా కాలనీలోకి దాదాపు 8 అడుగుల మేర వరద నీరు వచ్చాయి. మా పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అర్ధరాత్రి సమయంలో ఎన్డీఆర్‌ఎఫ్ వారి ద్వారా మమ్మల్ని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆ సమయంలో చాలా భయమేసింది. వారు ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతూ మాలో భయాన్ని పోగొట్టారు.

– కొత్తా వేణుమాధవ్, నందిగామ

ఆపద సమయంలో వారి సేవ మరువలేం



మా గ్రామానికి చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు మున్నేరు వరదలో చిక్కుకున్న సమయంలో సమాచారం తెలియగానే ఎమ్మెల్సీ అరుణకుమార్ నీటి ప్రవాహంలోనే నడుస్తూ దాదాపు 8 గంటల పాటు బాధితులకు ధైర్యం చెబుతూ సురక్షితంగా బయటకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్నారు. వారి సేవలు అభినందనీయం.

– చలమల మధు, కంచల గ్రామం

2 న చిల్లకల్లు-జగ్గయ్యపేట ఫోర్‌లేన్ రోడ్డు ప్రారంభోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: ఆగస్టు 2 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జగ్గయ్యపేటలో పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్ కొలగాని రాము, పార్టీ ప్రచార విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మొరె వినోద్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆగస్టు 2 వ తేదీన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జన్మదినోత్సవం రోజున ఉదయం 11 గంటలకు చిల్లకల్లు-జగ్గయ్యపేట మధ్య సుమారు 5 కి.మీ మేర రూ.14 కోట్లతో ఏర్పాటుచేసిన ఫోర్ లేన్ రోడ్డును మంత్రి దాడిశెటి రాజా, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద రాజన్న ఉచిత భోజన క్యాంటీన్‌ను అతిథులు ప్రారంభిస్తారని తెలిపారు. స్థానిక ఉక్కు కళావేదికలో విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని(క్యాన్సర్, గుండె, జనరల్ మెడిసిన్) ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస బ్రహ్మం, నాయకులు శేషం ప్రసాద్, పాటి సాంబ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు అర్జీల ద్వారా తెలియజేయవచ్చని, వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తారని తహసీల్దార్ తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామ: రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని పట్టణ సీఐ హనీష్ సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సత్ ప్రవర్తనతో ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. అవసరమైన విభాగాలకు పోయి జైలుపాలు కావద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

‘నిశ్శబ్ద గుండెపోటు’నుంచి కాపాడటమే ధ్యేయం

సేవ్ యంగ్ హార్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ భానుప్రసాద్



గుండె సంబంధిత పరీక్షల శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంసీ దాస్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిర్మాణాత్మక దశలో ఉన్న 35 నుంచి 45 ఏళ్ల వయసుగల వ్యక్తులు ‘నిశ్శబ్ద గుండెపోటు’తో మరణిస్తున్నారని, అటువంటి వారికి గుండె జబ్బులపై అవగాహన కల్పించటంతోపాటు సంబంధిత పరీక్షలు నిర్వహించి కాపాడటమే సేవ్ యంగ్ హార్ట్స్ ఫౌండేషన్ ధ్యేయమని ఆ సంస్థ చైర్మన్ చదలవాడ భానుప్రసాద్ పేర్కొన్నారు. విద్యాధరపురంలోని కౌస్తుభ నివాస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత గుండె సంబంధిత వైద్య శిబిరాన్ని విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల నిర్మాణాత్మక వయసులో ఉన్న వారు ‘నిశ్శబ్ద గుండెపోటు’కు గురై మరణిస్తున్నారని తెలిపారు. వీరిలో క్రీడాకారులు, సెలబ్రిటీలు కొందరు హఠాన్మరణం చెందుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న వివాహితుడైన 34 ఏళ్ల తన కుమారుడు కిరణ్ తేజ హఠాత్తుగా ‘నిశ్శబ్ద గుండెపోటు’తో మరణించాడని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తనలా పుత్రశోకంతో ఎవరూ బాధపడకూడదని, మానవతా దృక్పథంతో కిరణ్ తేజ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి, తద్వారా సేవ్ యంగ్ హార్ట్ ఫౌండేషన్ నెలకొల్పి 30–40 ఏళ్లలోపు యువతకు గుండె పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి, కౌస్తుభ నివాస్ అసోసియేషన్ సెక్రటరీ కిరీటి జైన్ పాల్గొన్నారు.

అక్కపాలెం రోడ్డుకు గండి



తిరువూరు: తిరువూరు-అక్కపాలెం వెళ్లే రహదారిలో మల్లమ్మ చెరువు వద్ద గండి పడింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పడమటి వాగు, రాకెట్ సప్లయ్ చానల్‌లో నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు కొట్టుకుపోయింది. అక్కపాలెం, రఘునాథబంజరు తదితర గ్రామాల ప్రజలు తిరువూరుకు మునుకుళ్లమీదుగా చుట్టూతిరిగి రావలసి వస్తోంది. గండిపూడ్చి రాకపోకలు పునరుద్ధరించాలని ఆర్ అండ్ బీ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

మెదడును చురుగ్గా ఉంచే అబాకస్ పోటీలు



అబాకస్‌లో ప్రతిభ చూపిన చిన్నారులతో గోపాలకృష్ణ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మనిషి ఆరోగ్యంగా ఉండటానికి శారీరక వ్యాయామం ఎంత అవసరమో, మెదడు చురుగ్గా పనిచేయాలంటే అబాకస్ లాంటివి అవసరమని ప్రముఖ విద్యావేత్త ఎం.గోపాలకృష్ణ అన్నారు. అబాకస్ పోటీలు మెదడును చురుగ్గా ఉంచుతాయన్నారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం సిప్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మానసిక గణిత విశ్లేషణ – అబాకస్ అండ్ బ్రెయిన్ జిమ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 900 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పోటీలను ప్రారంభించిన గోపాలకృష్ణ మాట్లాడుతూ పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం, పెంపొందించేందుకు అబాకస్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మేధో వికాసానికి విదేశాల్లో అమలులో ఉన్న అబాకస్ విధానాలను మన రాష్ట్రంలో కూడా సిప్ అకాడమీ అందిస్తున్నట్లు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలగనివ్వం

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం రానివ్వమని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ వరదకు మునేరులోని పైపులైన్లు కొట్టుకుపోయాయన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తక్షణం వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచటంతో పాటు, కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్‌ల వద్ద ప్రత్యేకంగా ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసి ట్యాంకర్లతో నింపుతున్నామన్నారు. పైపులైన్ శాశ్వత పరిష్కారానికి త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు.

కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు శంకరరావు



అంబటి మధుమోహన కృష్ణను సత్కరిస్తున్న దోకిపర్తి శంకరావు, ప్రకాశరావు, శ్యాం ప్రసాద్

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు దోకిపర్తి శంకరరావు అన్నారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయా గ్రంథాలయంలో ఆదివారం ఏపీ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ సామాజిక సేవలను గుర్తించి ఆత్మీయ సత్కారం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, అనుకున్నదొకటి ఐనదొకటి సాంఘీక నాటిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దోకిపర్తి శంకరరావు మాట్లాడుతూ ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ హనుమంతరాయా గ్రంథాలయం అనుబంధ సంస్థగా సాంఘీక సామాజిక రంగాలలో సేవలను అందిస్తునట్లు తెలిపారు. నగరంలో పెద్ద సంఖ్యలో వృద్ధ కళాకారులున్నారని, వారికి ఆర్థిక సాయం అందించేందుకు సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని సూచించారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ సభ్యుడు సుఖమంచి కోటేశ్వరరావు అంబటి మధుమోహన కృష్ణ సామాజిక సేవలను వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ మహిళా సంఘం అధ్యక్షురాలు దూపాటి శ్రీదేవి, రంగస్థల ప్రముఖులు కత్తి శ్యాంప్రసాద్, మల్లేశ్వర పట్నాయక్ పాల్గొన్నారు. ఎంఆర్ఎస్ ప్రకాశరావు నిర్వహించారు. నిర్వాహకులు అంబటి మధుమోహన కృష్ణను ఆత్మీయంగా సత్కరించారు. చివరిగా గోపి వల్లభ రచించి ఆర్ వాసు దర్శకత్వం వహించిన ‘అనుకున్నది ఒకటి ఐనదొకటి’ నాటికను ప్రదర్శించారు. అపర్ణ ప్రసాద్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు.

వాహనాల పత్రాలు వెంట ఉంచుకోవాలి

జయంతి(వీరులపాడు): వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వాహనదారులు విధిగా వెంట ఉంచుకోవాలని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని జయంతి గ్రామంలో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాలు సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం లైసెన్స్, వాహనాల పత్రాలు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

నందిగామ: ఓ వివాహిత అదృశ్యంపై నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన వివాహిత 29 వ తేదీ పుట్టింటికి వచ్చింది. అదేరోజు సాయంత్రం నుంచి కనిపించలేదు. దీంతో వివాహిత తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అధైర్యపడొద్దు... అన్నదాతలకు అండగా ఉంటాం

ప్రభుత్వవిప్ ఉదయభాను



తువ్వ కాలువకు పడిన భారీ గండిని రైతులతో కలిసి పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): అన్నదాతలు అధైర్యపడొద్దని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం ఆయన మునేరు వరద ఉధృతికి తువ్వ కాలువకు పడిన గండ్లు, దారుణంగా దెబ్బతిన్న రోడ్లు, వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మునేరుకు వరద ఉధృతంగా రావటంతో తువ్వ కాలువకు 36 చోట్ల చిన్న, పెద్ద గండ్లు పడ్డాయన్నారు. పొలాల్లో కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వరద నీటికి కొట్టుకు పోయాయన్నారు. గుమ్మడిదూర్రు వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. రైతులకు పంట నష్టం లేకుండా యుద్ధప్రాతిపదికన తువ్వకాలువ గండ్లు పూడ్చటంతో పాటు కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వేయిస్తామన్నారు. రైతులకు కూడా న్యాయం చేస్తామన్నారు. రహదారి మరమ్మతులు కూడా వెంటనే చేపడతామన్నారు. అనంతరం ఇరిగేషన్ సీఈ, ఎస్ఈ, ఆర్అండ్‌బీ డీఈ, విద్యుత్ శాఖ డీఈలతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు సర్పంచ్‌లు బి.జ్యోతిబ్రహ్మం, నక్కా కమల, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, వైఎస్సార్‌సీపీ పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలాల అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మండవ శ్రీనివాసగౌడ్, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, వేమూరి శేషగిరారావు, ఎంపీటీసీ సభ్యురాలు బారు సుధారాణి, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏలూరి శివాజీ, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

నీతి, నిజాయతీకి నిదర్శనం నాగరత్నం

- ఘనంగా మాడుగుల నాగరత్నం సంస్మరణ సభ
- నివాళులర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



నాగరత్నం సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: నీతి, నిజాయతీ, నిబద్ధతకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నం నిదర్శనమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణ సమీపంలోని మునేటి ఒడ్డునున్న ఆర్ఎస్ గార్డెన్స్‌లో నాగరత్నం సంస్మరణ సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముందుగా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడవ వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని పరితపించేవారన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ఆమె ఆశయాన్ని నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, కమిషనర్ జయరాం, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, మందా మరియమ్మ, గద్దె శేషుకుమారి, బండారు గంగమ్మ, నాయకులు గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, ఎండీ అమీన్, షేక్ జాఫర్, దాసు, విశ్వనాథపల్లి కృపారావు, బండారు వెంకట్రావ్, బెజవాడ రాజశేఖర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ రోడ్డుకు సర్పంచ్ ఆధ్వర్యంలో మరమ్మతులు



రోడ్డు మరమ్మతు పనులు పరిశీలిస్తున్న విప్ ఉదయభాను, పక్కన సర్పంచ్ పద్మకుమారి

పెనుగంచిప్రోలు: గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో మక్కపేట నుంచి పెనుగంచిప్రోలు వచ్చే ప్రధాన రహదారికి భారీ వర్షాలకు పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ఆదివారం సర్పంచ్ వేల్పుల పద్మకుమారి యుద్ధప్రాతిపదికన గ్రావెల్‌తో గుంతలు పూడ్పించారు. మరమ్మతు పనులను స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పరిశీలించి సర్పంచ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తరువాత రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బురద రాజకీయం ఇక కట్టిపెట్టు

వక్ఫ్‌బోర్డు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనసేన నాయకుడు పోతిన మహేష్ ప్రచారాల పిచ్చితో చేస్తున్న బురద రాజకీయాలను పక్కన పెట్టాలని వక్ఫ్‌బోర్డు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్ అన్నారు. తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలలో ఉన్నాం కాబట్టి ప్రతీ దానికి విమర్శించడమే పని అన్నట్లు ఉన్న మహేష్ తీరును ప్రజలు హర్షించబోరన్నారు. వెలగలేరులో జగనన్న కాలనీ లే అవుట్‌లో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీళ్లు వచ్చిన సందర్భాన్ని కూడా తన ప్రచార కార్యక్రమంగా మార్చుకుని ప్రభుత్వం, వెలంపల్లి పైన విమర్శలు చేయడాన్ని గౌస్‌మొహిద్దీన్ తప్పు పట్టారు. మొన్నటి వర్షాలు, వరదలకు దేశంలోని కొన్ని మహానగరాలు కూడా విలవిలలాడారన్నారు. అటువంటి భారీ వర్షాలకు జగనన్న లే అవుట్‌లో నీళ్లు రాకుండా ఎలా ఉంటాయని ప్రశ్నించారు.

అమ్మవారి భక్తులకు అన్నప్రసాద వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆదివారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీం ఆధ్వర్యంలో ఈ ఏడాది రిలీవింగ్ హంగర్ కార్యక్రమ డీసీ అప్పన వెంకట సత్యసాయి బాబు సహకారంతో వన్‌టౌన్ రథం సెంటర్‌లోగల అప్పన వెంకటకృష్ణయ్య సత్రం దగ్గర జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్లోబల్ మెంటర్‌షిప్ టీమ్ డీసీ ఎం.రవీందర్, ఆయన సతీమణి, సామరస్య క్లబ్ సభ్యులు బబిత పాల్గొని అందరికీ అన్నం వడ్డించారు. వారు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకునేందుకు నిత్యం వచ్చిపోయే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా భోజన సౌకర్యం కల్పిస్తున్న అప్పన వెంకట సత్యసాయి బాబు అభినందనీయులన్నారు. అందుకు ఆయనకు అమ్మవారి అనుగ్రహం ప్రాప్తించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గూటిక నాగిరెడ్డి, శ్యామలరావు పాల్గొన్నారు.

రేపు వేణుగోపాలస్వామి కల్యాణం

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి శ్రీవేణుగోపాలస్వామి మాస కల్యాణాన్ని ఆగస్టు 1న తిరువూరు శ్రీరస్తు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీ శ్రీరామవర ప్రసాదరావు ఆదివారం తెలిపారు. అధిక శ్రావణ శుద్ధ పౌర్ణమి నాడు సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.